క్లుప్తంగా

అంధుల ఆరాధ్య దేవుడు బ్రెయిలీ



దివ్యాంగులకు పండ్లు అందజేస్తున్న అర్జునరావు

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏపీ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ విశాఖ యూనిట్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని దివ్యాంగులకు బహుమతులు, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ నర్సింగ్ హెడ్ కె.జానకి, ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసరావు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కార్యక్రమం నిర్వహించారు.

నూతన బ్రాయిలర్ ప్రారంభం



నూతన బ్రాయిలర్‌ను ప్రారంభిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీన్నసింహస్వామి అన్నప్రసాద వితరణ భవనంలోని వంటశాలలో నూతన బ్రాయిలర్‌ను బుధవారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు ప్రారంభించారు. వంటశాలలో పాత బ్రాయిలర్ శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.2.5 లక్షలతో కొత్త బ్రాయిలర్ దేవస్థానం కొనుగోలు చేసింది. త్వరితగతిన అన్నప్రసాదాన్ని భక్తులకు అందించేందుకు కొత్త బ్రాయిలర్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు,వారణాసి దినేష్ రాజ్, పెనుమత్స శ్రీదేవి వర్మ, ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్, ఈఈ శ్రీనివాసరావు, ఏఈ ఫణి తదితరులు పాల్గొన్నారు.

'ఆ జీవో రద్దు చేయాలి'

పరవాడ: రాష్ట్రంలో రోడ్ షోలు, ర్యాలీలు, సభలను నిరోధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధాన పట్టణాల్లో సభలు నిర్వహించడానికి వీల్లేకుండా ఈ జీవో విడుదల చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదుల నోరు నొక్కే విధంగా ఈ జీవో ఉందని ఆరోపించారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్



నిందితున్ని విచారిస్తున్న సెబ్ సీఐ సరోజదేవి

సింహాచలం: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని బుధవారం పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద సెబ్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం పెందుర్తి సెబ్ అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా పెందుర్తి రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని తనిఖీ చేశారు. అతని వద్ద మూడు కిలోల డ్రై గంజాయి ఉండటంతో అతన్ని అరెస్టు చేశారు. సెబ్ సీఐ సరోజదేవి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పరవాడలో ఘనంగా పింఛన్ పంపిణీ వారోత్సవాలు



సభలో పాల్గొన్న పింఛన్‌దారులు, ప్రజలు



దివ్యాంగుడికి పెంచిన పింఛన్ కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పరవాడ సంతబయలు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ నూతన పింఛన్ పెంపు వారోత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ కానుక మంజూరు పత్రాలు, నగదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో అర్హులైన వారికి పింఛన్ రావాలంటే ముందున్న పింఛన్‌దారుల్లో ఒకరు మరణిస్తే తప్పా వచ్చేదికాదన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. మండలంలో 4,840 మంది పింఛన్‌దారులుండగా మళ్లీ కొత్తగా 194 పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. పింఛన్లకు నెలకు సుమారు రూ.1.73 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పింఛన్ పెంపుతో లక్షలాది మంది పింఛనుదారుల ఇళ్లలో కొత్త వెలుగులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు రూ. 2500 అందుతుండగా నూతన ఏడాది నుంచి రూ.2750 పొందుతున్న పింఛన్‌దారుల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టరు శీలం నదియా, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, ఈవోఆర్డీ పద్మజ, కార్పొరేటర్ ఇళ్లపు వరలక్ష్మిప్రసాద్, సీనియర్ నాయకులు పూర్ణానందశర్మ, చల్లా కనకారావు, కాసు అంజిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా పింఛన్ల పంపిణీ



95వవార్డు పరిధిలో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ దేముడు



సింహపురి లేఅవుట్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న రామరాజు, సచివాలయ సిబ్బంది

సింహాచలం: పింఛన్ పెంపుతో అవ్వాతాత మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోందని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 95వవార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం, ఎల్.ఎన్.నగర్, భవానీ నగర్ ప్రాంతాల్లో బుధవారం పింఛన్ పంపిణీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లకి వెళ్లి కార్పొరేటర్ ముమ్మన దేముడు పెరిగిన పింఛన్ సొమ్ము అందజేశారు. గంటల తరబడి క్యూల్లో వేచి ఉండి పింఛన్ తీసుకునే విధానానికి స్వస్తి పలికి సచివాలయం వ్యవస్థ ద్వారా ఇంటికే పింఛన్ ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రోమాల సూకరాజు, బొడ్డు నారాయణమూర్తి, అంగటి సూరిబాబు, చిప్పల చందు, కంచిబోయిన సంతోష్, బొడ్డు ప్రసాద్, చిన్నం నాయుడు, ఆర్పీ దీపిక, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

- 98వ వార్డు పరిధిలోని సింహపురిలే అవుట్‌లో సచివాలయం సిబ్బందితోకలిసి వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు నడింపల్లి రామరాజు, కె. పైడిరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

సింహాచలం వచ్చే మార్గాల్లో స్వాగత ద్వారాలు

ఈవోకు సూచించిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: సింహాచలం వచ్చే మార్గాల్లో దేవస్థానం స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు సూచించారు. సింహగిరిపై ఆలయ బేడా మండపంలో బుధవారం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ పలు అభివృద్ధి పనుల విషయంపై ఈవోతో సమావేశమయ్యారు. పెందుర్తి – ఆనందపురం కొత్త మార్గంలో సింహాచలం వెళ్లే రహదారిలో స్వాగత ద్వారం ఏర్పాటు చేయాలని సూచించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఆమార్గంలో వచ్చే భక్తులు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకుందని తెలియజేశారు. అలాగే శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మిస్తున్న కల్యాణ మండపాల పనులు వేగవంతం చేసి తక్షణమే భక్తులకు అందుబాటులోకి తేవాలని.. కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని సత్రాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సింహగిరి మెట్లమార్గం అభివృద్ధి చేయాలని, కనుమ రోజు స్వామివారు కొండదిగువకు వస్తారని గుర్తుచేశారు.

చందనం సమర్పణకు రూ. 50వేల విరాళం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ రూ. 50 వేల విరాళం చెక్కు రూపంలో ఈవో త్రినాథరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో నరసింహరాజు, సూపరింటిండెంట్ పిళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం



ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు, నాయకులు

సబ్బవరం: అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా ప్రతి లబ్ధిదారునికి గౌరవంగా వారి ఇంటికే పింఛన్లు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఆరిపాకలో వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్ రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హాజరై లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బవరం మండలంలో నెలకు రూ.2.23 కోట్లు పింఛన్ల కింద అందజేస్తున్నట్టు తెలిపారు. మండలంలో 257 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు.

పింఛన్ల పంపిణీలో ఏపీ టాప్

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ సామాజిక పింఛన్ల పంపిణీలో రాష్ట్రం టాప్‌లో ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేయడంతో ప్రతి పక్షనేత చంద్రబాబుకు కలవరం మొదలైందన్నారు. దీంతో కానుకల పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. గుంటూరు సభలో చంద్రన్న కానుకల పేరుతో చేపట్టిన కార్యక్రమంలో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకముందు కందుకూరు సభలో మరో 8 మంది మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు.

పలువురి చేరిక

ఆరిపాకకు చెందిన పలువురు టీడీపీ నాయకులు పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పారు. ఆరిపాక సచివాలయం అదనపు భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన పెందుర్తి జట్టును అభినందించి ఎమ్మెల్యే రూ.30 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు,సర్పంచ్ పాలిశెట్టి పార్వతి,వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీలక్ష్మీరాణి, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, గొర్లి ఉమామహేశ్వరరావు, డీఎల్ డీవో మంజులావాణి, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, శరగడం రాము,సాలాపు వెంకటేశ్వరరావు,సబ్బవరపు నారాయణమూర్తి,రాపేటి రాము,పిఎసిఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు వివరించి.. సమస్యలు తెలుసుకుని

టెక్కలిపాలెంలో ఉత్సాహంగా గడపగడపకు..



టెక్కలిపాలెంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి సకాలంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. మండలంలోని వంగలి సచివాలయం పరిధిలోని టెక్కలిపాలెంలో బుధవారం గడపగపడకు మన ప్రభుత్వం కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారి తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి రూ.14.30 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ప్రతి పాదనలను సిద్ధం చేసినట్టు తెలిపారు. తమ వృత్తి పనికి వీలుగా ధోబీ ఘాట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను రజకులు కోరారు. కార్యక్రమంలో పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, నాయకులు కొటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, కొటాన వెంకట రమణ,గవర రాజు,సబ్బవరపు నారాయణమూర్తి,శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో దీపాలంకరణ సేవ



విశేషఅలంకరణలో గోదాదేవి



వెంకటాద్రిపై గోదాదేవికి హారతి అందజేస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: ధనుర్మాస పూజలు బుధవారం పలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారు జామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరు వీధిని వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పూజలు చేశారు.

- పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు.తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవి చెంతన ప్రత్యేక పూజలు చేసి హారతులు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు. భక్తుకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజల ను నిర్వహించారు.
- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారిని విశేష అలంకరించారు. పాశుర విన్నప పారాయణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.
- పెందుర్తి మండలం చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో శంఖుచక్రనామాలకు విశేషంగా దీపాలంకరణ చేశారు. పాశురవిన్నప పారాయణ ఘనంగా నిర్వహించారు.

ఈవోకు ఆహ్వానం



ఈవోకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న రఘునాథచార్యస్వామి

సింహాచలం: లోక కల్యాణార్థం అనకాపల్లి జిల్లా కొండకొప్పాక గ్రామంలోని అష్టలక్ష్మీ పీఠం ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 15వరకు హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి దరి మౌలాలిలో 21వ అష్టలక్ష్మీ యాగం నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి పీతాంబరం రఘునాథచార్య స్వామి తెలిపారు. యాగానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను బుధవారం సింహగిరిపై దేవస్థానం ఈవో త్రినాథరావుకి ఆయన అందజేశారు. ఫిబ్రవరి 2న భూమిపూజ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



మల్లునాయుడుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి నుంచి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని మల్లునాయుడుపాలెం సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు దళారి వ్యవస్థ నుంచి విముక్తి పొందడంతో పాటు పూర్తి మద్దతు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.రైతులకు అవసరమయ్యే గోనె సంచులు, హమాలీ ఖర్చులు,రవాణా ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. తొలి రోజు 332 ధాన్యం బస్తాలు సేకరించారు.ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోను దేముడమ్మ, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ ,గ్రామ పెద్దలు బోను గంగునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఏఈవో బాలరాజు, వీఏఏ హేమలత తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వంశీకృష్ణశ్రీనివాస్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు పెనుమత్స శ్రీదేవివర్మ, ట్రస్ట్‌బోర్డ్ ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్, 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి ఆయన వెంట ఉన్నారు.

కవిత్వం అజరామరం



మాట్లాడుతున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

సీతంపేట: కవిత్వం హృదయ రంజకంగా, అలంకారయుక్తంగా, సందేశాత్మకంగా ఉండాలని ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ప్రాచీన కవుల సాహిత్యం మార్గదర్శకం కావాలని, సాహిత్యం ప్రతి ఒక్కరి సొత్తు, కవిత్వం అజరామరం, సమాజాన్ని సరైనా దారిలో నడిపేది కవిత్వమన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి సంస్థ 42 ఏళ్లుగా సాహిత్య సేవ చేస్తూ, తెలుగు సాహిత్యానికి, కవులకు ఒక అధ్యయన కేంద్రంగా, ఎందరో కవులకు మార్గదర్శకంగా విలసిల్లుతోందన్నారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ప్రముఖ కవి అదృష్ట దీపక్ రచనలను సభకు పరిచయం చేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పి.ఎల్.వి.ప్రసాద్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, టి.పట్టాభి రామారావు, డి.వి. సూర్యారావు, దేవులపల్లి పద్మజ, పంతుల లలిత, భీమేశ్వరరావు, పి.వి.ఆర్.కె.రావు, రామతాత, వై.సత్యవతి, కె.రఘువీర్ తదితరులు కవితలు చదివి వినిపించారు.

జోరుగా ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న యునైటెడ్ ప్యానల్ అభ్యర్థులు

ఉక్కునగరం: స్టీల్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మూడు ప్యానళ్ల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జ్యోతిరావు పూలే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు కోమటి రవిశంకర్, నక్క వెంకటరమణ బుధవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ప్రచారం నిర్వహించారు. తమ ప్యానల్‌ను గెలిపిస్తే మరిన్ని హక్కులు, సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహలక్ష్మి నాయుడు, నమ్మి తాతారావు, పిల్లి చంద్రరావు, కొణతాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

- యునైటెడ్ ప్యానల్‌ను గెలిపించాలని ప్యానల్ అధ్యక్ష అభ్యర్థి బి. అప్పారావు, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి ఎం. శ్రీనివాసరావు కోరారు. బుధవారం మెయిన్ గేటు వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తమ ప్యానల్‌ను గెలిపిస్తే ఓబీసీ ఉద్యోగుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 692వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షల్లో డబ్ల్యూ.ఎం.డి, యుటిలిటీ, అడ్మిన్, టీఏ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల నుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్. రామచంద్రరావు, జె.రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని మన రాష్ట్ర పార్లమెంట్ సభ్యులందరూ కలిసి ప్రస్తుత పార్లమెంట్‌లో గళమెత్తాలని కోరారు. విశాఖ ఉక్కు కోసం ప్రత్యేకంగా చర్చించాలన్నారు. కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.ఈశ్వరరావు, వి.ఎస్. వరప్రసాద్, బి.బాలస్వామి, ఎస్.నాగార్జున, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

లెర్నర్ పోర్టల్‌లో కోర్సు మెటీరియల్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో 2022–23 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కోర్సు మెటీరియల్‌ను లెర్నర్ పోర్టల్‌లో పొందుపరిచారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో దీనిని లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు తమ గుర్తింపు నంబరును నమోదు చేసి కోర్సు మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు ఐఎన్‌టీయూసీ ధర్నా

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించనున్నారు. ఉక్కు కార్మికుల వేతన ఒప్పందానికి సంబంధించి ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు ఎల్ అండ్ డీసీ కేంద్రం వద్ద జరగనున్న ధర్నాలో యూనియన్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు కోరారు.